గంటకు 280 కి.మీ.

త్వరలో హైస్పీడ్ రైళ్లు

న్యూఢిల్లీ: భారత దేశపు నవతరం అత్యాధునిక రైళ్లు త్వరలో అందుబాటులోకి రాబోతున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంటులో బుధవారం చెప్పారు. గంటకు 280 కి.మీ. వేగంతో నడిచే రైళ్లను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ డిజైన్ చేసి, తయారు చేస్తున్నదని తెలిపారు. దీనికి బీఈఎంఎల్ సహకరిస్తున్నదన్నారు. మనం తయారు చేసిన వందే భారత్ రైళ్లు విజయవంతమయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఇండియన్ రైల్వేస్ అత్యధిక వేగంతో నడిచే రైళ్ల డిజైనింగ్, తయారీ కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఒక కార్ తయారీ వ్యయం సుమారు రూ.28 కోట్లు అని, మిగిలిన రైళ్లతో పోల్చితే ఇది అత్యంత సరసమైన ధర అని వివరించారు.

500.. 2 వేల నోట్లు

3 రెట్లు పెరిగిన నకిలీ కరెన్సీ

న్యూఢిల్లీ, నవంబర్ 27: దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న నకిలీ కరెన్సీ పట్ల కేంద్ర ఆర్థిక శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. మహాత్ముని చిత్రంతో ఉన్న కొత్త సీరిస్ 500 రూపాయల నకిలీ నోట్లు 2018-19 నుంచి 2023-24 కాలంలో నాలుగు రెట్లు పెరిగాయి. అలాగే 2020-21 నుంచి 2,000 రూపాయల నకిలీ నోట్లు కూడా మూడు రెట్లు పెరిగినట్టు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రకటించారు. దేశంలో నకిలీ నోట్లపై లోక్‌సభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

7.62 లక్షల కిలోలు

మాదక ద్రవ్యాలు ధ్వంసం

న్యూఢిల్లీ, నవంబర్ 27: దేశంలోని డ్రగ్ నిఘా సంస్థలు 2023లో 7 లక్షల కిలోలకు పైగా మాదకద్రవ్యాలను ధ్వంసం చేసినట్టు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ వెల్లడించారు. బుధవారం ఆయన రాజ్యసభలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు. 2019తో పోలిస్తే 2023లో మూడు రెట్లు అధికంగా మాదకద్రవ్యాలను, మస్తిష్కంపై ప్రభావం చూపే మత్తు మందులను ధ్వంసం చేసినట్టు చెప్పారు. 2019లో 1,55,929 కిలోలు, 2023లో 7,62,015 కిలోల మాదకద్రవ్యాలు ధ్వంసం చేశామన్నారు. ఇది 388 శాతం అధికమని చెప్పారు. ఇలా ధ్వంసం చేసిన పదార్థాలలో మాత్రలు, ఇంజక్షన్లు, యాంపిల్స్, దగ్గు సిరప్‌లు కూడా ఉన్నాయని చెప్పారు.

6000 కోట్లు

గుజరాత్‌లో పోంజీ స్కామ్

అహ్మదాబాద్, నవంబర్ 27: బీజేపీ పాలిత గుజరాత్ రాష్ట్రంలో భారీ కుంభకోణం బయటపడింది. ఉత్తర గుజరాత్‌లోని సబర్కాంత జిల్లాలో 6,000 కోట్ల పోంజీ స్కామ్ వెలుగుచూసినట్టు సీఐడీ ప్రకటించింది. ఈ కుంభకోణ ప్రధాన నిందితుడు బీజేపీ నేత అని, అతను పరారీలో ఉన్నాడని తెలిపారు. బ్యాంకుల కన్నా అధిక వడ్డీ ఇస్తామని చెప్పిన మాటలు నమ్మి వేలాది మంది ఈ స్కీమ్‌లో డబ్బులు పెట్టుబడి పెట్టి మోసపోయారు. ఈ కుంభకోణం కనీసం ఏడు జిల్లాలకు వ్యాపించినట్టు పోలీసులు తెలిపారు. పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ బృందాలు సబర్కాంత, మరో ఆరు జిల్లాల్లోని బీజే ఇంటర్నేషనల్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌పై దాడులు నిర్వహించాయి. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితుడు అయిన సంస్థ సీఈవో భూపేంద్రసిన్హ్.. ఇటీవల ఎన్నికల్లో బీజేపీ టికెట్‌కు ప్రయత్నించాడని బాధితులు తెలిపారు.

300 ఏండ్ల చరిత్ర

ఊరంతా శాకాహారులే

పాట్నా: బీహార్‌లోని గయ జిల్లాలో ఉన్న బిహియాన్ గ్రామానికి గొప్ప చరిత్ర ఉంది. ఇక్కడి ప్రజలు ఆచరించే సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఆచారాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. 300 సంవత్సరాల నుంచి ఈ గ్రామస్థులు శాకాహారులుగానే కొనసాగుతున్నారు. వీరు పూజించే బ్రహ్మ బాబా ఆగ్రహానికి గురికాకుండా ఉండాలంటే శాకాహార జీవన విధానాన్నే అవలంబించాలని వీరు విశ్వసిస్తున్నారు. యువతరంతో పాటు ఈ గ్రామస్థులను పెండ్లి చేసుకునే యువతులు కూడా వీరి జీవన విధానాన్నే అనుసరిస్తూ, శాకాహారులుగానే మారుతున్నారు. మరోవైపు వీరు మద్యపానం, ఉల్లి, వెల్లుల్లికి కూడా దూరంగా ఉంటున్నారు. గ్రామంలో 400 కుటుంబాలు ఉన్నాయి.

5,900 కోట్లు

చెత్తపాలు

న్యూఢిల్లీ: యూకేలో ఓ మహిళ తన మాజీ భాగస్వామి హార్డ్‌డ్రైవ్‌ను చెత్తబుట్టలో పడేసింది. అందులో అప్పటికే 8 వేల బిట్‌కాయిన్లు ఉన్నాయి. ఇప్పుడు వాటి విలువ 569 మిలియన్ పౌండ్లు. (దాదాపు రూ.5,900 కోట్లు). ఇప్పుడా హార్డ్ డ్రైవ్ వేల్స్‌లోని న్యూపోర్ట్‌లో లక్ష టన్నుల చెత్త కింద ఉండొచ్చని భావిస్తున్నారు. అతడు తనకో చెత్త బ్యాగును ఇచ్చి బయటపడేయాలని చెప్తే తీసుకెళ్లి పడేశానని, నిజానికి అందులో ఏముందో తనకు తెలియదని జేమ్స్ హావెల్స్ మాజీ గాళ్‌ఫ్రెండ్ అయిన హాల్ఫినా ఎడ్డీ ఇవాన్స్ వివరించింది. దానిని కోల్పోవడం తన తప్పు కాదని పేర్కొంది. అతడు దానిని కనుగొనాలని ఆశిస్తున్నానని, అందులోంచి తనకు ఒక్క రూపాయి కూడా అక్కర్లేదని జేమ్స్ హావెల్స్‌ను ఉద్దేశించి పేర్కొంది. అయితే, అతడు దీని గురించి మాట్లాడడం ఆపేయాలని కోరుకుంటున్నానని, అది మానసిక ఆరోగ్యానికి అంతమంచిది కాదని తెలిపింది. మరోవైపు, లక్ష టన్నుల చెత్తకింద ఉన్న డబ్బు (హార్డ్‌డిస్క్) కోసం హావెల్స్ ప్రయత్నాలు ప్రారంభించాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ చెత్త కింద ఉన్న డబ్బును సొంతం చేసుకుంటానని చెప్పుకొచ్చాడు.

చేయని నేరానికి శిక్ష.. 110 కోట్లు పరిహారం

న్యూయార్క్ : నిరపరాధి అయినప్పటికీ, దొంగతనం, హత్య కేసులో దాదాపు మూడు దశాబ్దాలపాటు జైలులో మగ్గిపోయిన మైఖేల్ సూలివాన్ (64)కు దాదాపు రూ.110 కోట్ల పరిహారం లభించింది. 1986లో మసాచుసెట్స్‌లోని ఫ్రామింగ్‌హామ్‌లో విల్‌ఫ్రెడ్ మెక్‌గ్రాత్ దొంగతనం, హత్యకు గురయ్యారు. ఈ కేసులో గ్యారీ గ్రేస్ కూడా అనుమానితుడు. అయితే, మైఖేల్‌ను గ్యారీ ఇరికించాడు. దీంతో ఆయనపై ఆరోపణలను ప్రాసిక్యూషన్ ఉపసంహరించింది. మైఖేల్‌కు యావజ్జీవ జైలు శిక్ష పడింది. మసాచుసెట్స్ జ్యూరీ ఈ కేసులో మైఖేల్ నిర్దోషి అని తీర్పు చెప్పింది. ఆయనకు నష్టపరిహారంగా రూ.110 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఆయన జైలులో ఉన్న కాలంలో ఆయన తల్లి, నలుగురు తోబుట్టువులు మరణించారు. జైలులో అనేకసార్లు దాడులకు గురయ్యారు.



బ్రిటన్ వ్యక్తికి జాక్‌పాట్ 1800 కోట్లు

న్యూఢిల్లీ: బ్రిటన్‌కు చెందిన ఓ వ్యక్తిని అదృష్టం వరించింది. రాత్రికి రాత్రే కోట్లు గెలుచుకుని యూకే సంపన్నుల్లో ఒకడిగా మారిపోయాడు. నేషనల్ లాటరీ టికెట్ కొన్న అతడికి ఏకంగా 177 మిలియన్ పౌండ్లు.. భారత కరెన్సీలో చెప్పాలంటే దాదాపు రూ.1,800 కోట్లు లభించాయి. మంగళవారం నిర్వహించిన డ్రాలో 07, 11, 25, 31, 40 నంబర్లు విజయాన్ని చేకూర్చాయి. మొత్తం యూకేలోనే మూడో అతిపెద్ద లాటరీ ప్రైజ్ మనీ ఇదేనట. ఆ అదృష్టవంతుడి పేరు వెల్లడించేందుకు నిర్వాహకులు నిరాకరించారు. ఈ విజేత ఈ ఏడాది సండే టైమ్స్ సంపన్నుల జాబితాలోని మ్యుజిషియన్స్ హ్యారీ స్టైల్స్ (175 మిలియన్ పౌండ్లు), అడెలె (170 మిలియన్ పౌండ్లు) కన్నా ఎక్కువ సంపదను సొంతం చేసుకున్నారు. విన్నింగ్ టిక్కెట్‌ను వ్యాలిడేట్ చేసి, సొమ్ము చెల్లించిన తర్వాత, విజేత తన వివరాలను గోప్యంగా ఉంచవచ్చు, లేదా, బహిరంగంగా ప్రకటించుకోవచ్చు. 2022 జూలై 19న జరిగిన డ్రాలో 195 మిలియన్ పౌండ్లు గెలుచుకున్న విజేత నేషనల్ లాటరీలో ప్రథమ స్థానంలో నిలిచారు.



రిజర్వేషన్ల కోసం మతం మారడం..

రాజ్యాంగాన్ని మోసగించడమే

- ఇది రిజర్వేషన్ల లక్ష్యాన్ని ఓడించడమే అవుతుంది
- క్రిస్టియన్‌గా మారితే కుల గుర్తింపు పోయినట్టే
- సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్ 27: నిజమైన విశ్వాసం లేకుండా కేవలం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందేందుకు మతం మారడం రాజ్యాంగాన్ని మోసగించడమేనని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఇది రిజర్వేషన్ల విధానానికే విరుద్ధమని, రిజర్వేషన్ల లక్ష్యాన్ని ఓడించడమేనని స్పష్టం చేసింది. సెల్వరాణి అనే మహిళ హిందూ తండ్రి, క్రైస్తవ తల్లికి జన్మించింది. పుట్టిన కొన్నిరోజులకే బాప్టిజం తీసుకొని, క్రైస్తవాన్ని ఆచరిస్తున్నది. పుదుచ్చేరిలో అప్పర్ డివిజన్ క్లర్క్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసేందుకు తన తండ్రి కులమైన వెల్లువన్‌గా తనకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయించాలని ఆమె మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ఆమె వినతిని హైకోర్టు జనవరి 24న తిరస్కరించింది. దీంతో ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ ఆర్ మహదేవన్.. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు.

బాప్టిజం తీసుకున్న తర్వాత హిందువు కాదు

ఈ కేసులో ఇచ్చిన 21 పేజీల తీర్పులో సుప్రీంకోర్టు కీలక విషయాలను పేర్కొన్నది. 'మతంపై నిజమైన విశ్వాసం లేకుండా, కేవలం రిజర్వేషన్ల ప్రయోజనాలను పొందేందుకు మతం మారడాన్ని అనుమతించలేం. ఇలాంటి నిగూఢ ఉద్దేశాలు కలిగిన వ్యక్తులకు రిజర్వేషన్ల ప్రయోజనాలు అందడం అంటే రిజర్వేషన్ల విధాన లక్ష్యాన్ని ఓడించడమే అవుతుంది.' అని ధర్మాసనం పేర్కొన్నది. ఉద్యోగం కోసమే పిటిషనరు హిందువుగా చెప్పుకొని ఎస్సీ సర్టిఫికెట్ అడుగుతున్నారని, బాప్టిజం తీసుకున్న తర్వాత ఆమె హిందువుగా గుర్తింపును పొందలేరని కోర్టు స్పష్టం చేసింది. ఆమె ఇప్పటికీ క్రైస్తవాన్ని ఆచరిస్తున్నారనే విషయం చర్చి అటెండెన్స్ ద్వారా స్పష్టమవుతున్నదని, కాబట్టి హిందువుగా ఆమె చేస్తున్న వాదనను సమర్థించలేమని పేర్కొన్నది. క్రైస్తవంలోకి మారే వారు తమ కుల గుర్తింపును కోల్పోతారని, ఒకవేళ వారు ఎస్సీ ప్రయోజనాలు పొందాలనుకుంటే మళ్లీ మతం మారినట్టు కచ్చితమైన ఆధారం ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ కేసులో పిటిషనర్ ఏ కార్యక్రమంలో లేదా ఆర్యసమాజ్ ద్వారా మళ్లీ హిందూ మతాన్ని స్వీకరించలేదని, ఆమె ఇప్పటికీ క్రైస్తవాన్ని పాటిస్తున్నట్టు ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నది. ఈ పిటిషన్‌ను కొట్టేసింది.

షిండే ఖేల్ ఖతం!

- 'మహా' సీఎంగా ఫడ్నవీస్!
- నేడు ప్రకటించే అవకాశం
- ఏక్‌నాథ్ ఆశలు గల్లంతు
- డిప్యూటీ సీఎంగా డిమోషన్

న్యూఢిల్లీ, నవంబర్ 27: మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై స్పష్టత వచ్చింది. బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి కావడం దాదాపు ఖాయమైంది. ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం ఈ మేరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో పాటు ఎన్డీఏ పక్షాలకు స్పష్టతనిచ్చినట్టు తెలుస్తున్నది. గురువారం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నది. దీంతో మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఏక్‌నాథ్ షిండే పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. షిండేతో పాటు ఎన్సీపీ నేత అజిత్ పవార్‌కు ఉప ముఖ్యమంత్రులుగా అవకాశం దక్కనుంది. దీంతో సీఎం నుంచి డిప్యూటీ సీఎంగా ఏక్‌నాథ్ షిండేకు డిమోషన్ దక్కినట్టయ్యింది. గురువారం మహారాష్ట్రలోని ఎన్డీఏ పార్టీల నేతలతో అమిత్ షా సమావేశం నిర్వహించనున్నారు.

నేను ఎప్పటికీ కార్యకర్తనే: షిండే

ఫడ్నవీస్ వైపే బీజేపీ హైకమాండ్ మొగ్గు చూపుతున్న విషయం స్పష్టం కావడంతో షిండే అనివార్యంగా వెనక్కు తగ్గారు. సీఎం పదవిపై బీజేపీ తీసుకునే నిర్ణయానికి తాను పూర్తి సహకారం అందిస్తానని, ఈ ప్రక్రియకు తాను ఎలాంటి ఆటంకం కాబోనని బుధవారం ఆయన ప్రకటించారు. 'నేను ఎప్పటికీ కార్యకర్తనే. నా దృష్టిలో సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు, కామన్ మ్యాన్' అని ఆయన వ్యాఖ్యానించారు.

జార్ఖండ్ సీఎంగా నేడు సొరేన్ ప్రమాణం

రాంచీ: జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం చీఫ్ హేమంత్ సొరేన్ గురువారం ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయన చేత గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయిస్తారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖుల్లో, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎన్సీపీ-ఎస్పీ చీఫ్ శరద్ పవార్, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ, మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు ఉన్నారు. ముఖ్యమంత్రిగా హేమంత్ ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. ఈ ఎన్నికల్లో జేఎంఎం కూటమికి రాష్ట్రంలోని 81 నియోజకవర్గాల్లో 56 స్థానాలు, ఎన్డీయే కూటమికి 24 స్థానాలు లభించిన సంగతి తెలిసిందే.

ఈడీ నేర నిరూపణ శాతం ఎంత?

- 60-70% ఉంటే అర్థం చేసుకోగలం
- కానీ అత్యంత దయనీయంగా ఉంది
- దీర్ఘకాలం నిందితుల కస్టడీ సరికాదు
- దర్యాప్తు సంస్థను ప్రశ్నించిన సుప్రీం

న్యూఢిల్లీ, నవంబర్ 27: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన కేసులలో నేర నిరూపణ శాతం తక్కువగా ఉండటం పట్ల సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తృణమూల్ కాంగ్రెస్ నేత, పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి పార్థ చటర్జీ బెయిల్ పిటిషన్ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'మీరు నమోదు చేసిన కేసులలో నేర నిరూపణ శాతం ఎంత? ఒక వేళ 60-70 శాతం ఉంటే మేము అర్థం చేసుకునేవాళ్లం. కానీ అది చాలా దయనీయంగా ఉంది' అని విచారణ సందర్భంగా జస్టిస్ ఉజ్జల్ భుయన్ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లో టీచర్ల రిక్రూట్‌మెంట్ కుంభకోణంలో మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు పార్థ చటర్జీపై కేసు నమోదైంది. ఆయన బెయిల్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం ఎలాంటి విచారణ జరపకుండా దీర్ఘ కాలం పాటు నిందితులను కస్టడీలో ఉంచడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. 'ఒక వ్యక్తిని చిరకాలం కస్టడీలో ఉంచిన తర్వాత చివరకు అతను నిర్దోషి అని తేలితే ఏం జరుగుతుంది? 2.5 నుంచి 3 ఏండ్ల కస్టడీలో ఉండటమంటే తక్కువ కాలం కాదు' అని ధర్మాసనం పేర్కొంది.

సెల్ఫ్ డ్రైవింగ్ శాటిలైట్లు!

- అంతరిక్ష సాంకేతికతలో చైనా ఘనత
- ఒకేసారి రెండు ఉపగ్రహాల ప్రయోగం



బీజింగ్, నవంబర్ 27: అంతరిక్ష సాంకేతికతలో చైనా మరో ముందడుగు వేసింది. ప్రపంచంలోనే మొదటిసారిగా సివేయ్ జాయోజింగ్-2 03, జాయోజింగ్-2 04 అనే రెండు సెల్ఫ్ డ్రైవ్ ఉపగ్రహాలను రోదసిలోకి పంపించింది. చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్(సీఏఎస్‌సీ) అనుబంధ సంస్థ అయిన షాంఘై అకాడమీ ఆఫ్ స్పేస్‌ఫ్లైట్ టెక్నాలజీ(ఎస్ఏఎస్‌టీ) ఈ ఉపగ్రహాలను అభివృద్ధి చేసింది. జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి సోమవారం లాంగ్ మార్చ్-2సీ రాకెట్ ద్వారా వీటిని ప్రయోగించారు.

వాటికవే ప్రయాణించేలా అభివృద్ధి

భూమి నుంచి ఎలాంటి జోక్యం లేకుండా వాటికవే మార్గాన్ని నిర్దేశించుకొని ప్రయాణించేలా, మార్గాన్ని మార్చుకునేలా వీటిని తయారుచేశారు. ఈ ఉపగ్రహాలు సర్వే, మ్యాపింగ్ కోసం పని చేయనున్నాయి. నిర్దేశించిన పని పూర్తి చేసిన తర్వాత అత్యంత కచ్చితత్వంతో వాటికవే తిరిగి వాటి కక్ష్యలోకి వస్తాయి. సాధారణ ఆప్టికల్ ఉపగ్రహాలు ఇన్‌ఫ్రారెడ్ లైట్‌పై ఆధారపడి పని చేస్తాయి. ఈ ఉపగ్రహాలు మాత్రం మైక్రోవేవ్ సిగ్నల్స్ ద్వారా పని చేస్తాయి. దీంతో ఇవి మేఘాలు, పొగమంచు ఉన్నప్పుడూ సర్వే, మ్యాపింగ్ కోసం పని చేయగలవు. రాత్రిపగలు, వాతావరణంతో సంబంధం లేకుండా హై రిజల్యూషన్ ఫొటోలను తీయగలవు. ఉపగ్రహాల ద్వారా సర్వే, మ్యాపింగ్ చేసే సాంకేతికతలో ఇది విప్లవాత్మకంగా మారొచ్చని చైనా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

అజ్మీర్ దర్గా కింద శివాలయం!

కోర్టులో పిటిషన్..

కేంద్రానికి నోటీసులు

న్యూఢిల్లీ: రాజస్థాన్‌లోని అజ్మీరులో ఉన్న సూఫీ సెయింట్ మొయినుద్దీన్ ఛిస్తీ దర్గా కింద శివాలయం ఉందని అజ్మీరు కోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. ఈ శివాలయంలో పూజలు చేసేందుకు హిందువులకు అనుమతి ఇవ్వాలని పిటిషనర్ కోరారు. పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ, తమ పిటిషన్‌పై కోర్టు స్పందించిందని చెప్పారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ), అజ్మీరు దర్గా కమిటీ, మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

సియాచిన్, గల్వాన్‌లో పర్యటించొచ్చు: ఆర్మీ

పుణే: అత్యంత కఠోరంగా ఉండే యుద్ధ క్షేత్రాలు సియాచిన్ మంచు కొండలు, కార్గిల్, గల్వాన్ లోయలను ప్రత్యక్షంగా చూడటానికి పర్యాటకులకు అనుమతి ఇవ్వాలని భారత సైన్యం నిర్ణయించింది. సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది బుధవారం జనరల్ బీసీ జోషీ స్మారకోపన్యాసంలో మాట్లాడుతూ, ఇటువంటి విధానం వల్ల జమ్ముకశ్మీరు ఉగ్రవాదం నుంచి పర్యాటకానికి మారిందని చెప్పారు.

విద్యార్థుల కోసం 'హ్యాపీ క్యాంపస్'లు

ఆర్ట్ ఆఫ్ లివింగ్ కొత్త కార్యక్రమం



బెంగళూరు, నవంబర్ 27: విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు 'హ్యాపీ క్యాంపస్' పేరుతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ కొత్త కార్యక్రమాన్ని చేపట్టనుంది. విద్యార్థులకు సుదర్శన క్రియ, ధ్యానం, ప్రాణాయామం వంటివి నేర్పించి, వారిలో ఏకాగ్రతను, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించనుంది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 70 పాఠశాలలు, విశ్వవిద్యాలయాలతో బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విద్యాసంస్థల్లో చదువుతున్న 1.78 లక్షల మంది విద్యార్థులకు మానసిక ఒత్తిడిని జయించేలా శిక్షణ ఇవ్వనుంది. ఈ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మికవేత్త శ్రీశ్రీ రవిశంకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు విపరీతమైన ఒత్తిడికి లోనవుతున్నారని, ఆత్మన్యూనత, దూకుడు స్వభావంతో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఒత్తిడిని తగ్గించి, ఏకాగ్రతను పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

అదానీ వ్యవహారంపై అట్టుడికిన పార్లమెంటు

న్యూఢిల్లీ, నవంబర్ 27: అదానీ వ్యవహారం రెండో రోజు పార్లమెంటును కుదిపేసింది. అమెరికాలో అదానీ సంస్థపై నమోదైన కేసు, ఈ సంస్థపై వచ్చిన ఆరోపణలపై చర్చకు ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసపైనా చర్చించాలని డిమాండ్ చేశారు. దీంతో ఉభయసభలు గురువారానికి వాయిదా పడ్డాయి. బుధవారం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా.. ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. దీంతో ప్రతిపక్షాల సభ్యులు అదానీ, సంభాల్ హింసపై చర్చించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో సభను 12 గంటలకు వాయిదా వేశారు. సభ ప్రారంభమయ్యాక కూడా నినాదాలు కొనసాగడంతో సభ గురువారానికి వాయిదా పడింది. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో సభను ఒక రోజు వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌కర్ ప్రకటించారు.

జనవరి 31న నీట్ ఎండీఎస్

మార్చి 29-30న నీట్ ఎస్ఎస్



న్యూఢిల్లీ, నవంబర్ 27: వచ్చే ఏడాది జరిగే నీట్ ఎండీఎస్, నీట్ ఎస్ఎస్ పరీక్షలతోపాటు ముఖ్యమైన పలు ఇతర పరీక్షల తేదీలను ఎన్‌బీఈఎంఎస్ (నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్) తాత్కాలికంగా ప్రకటించింది. జనవరి 31న నీట్ ఎండీఎస్, మార్చి 29-30న నీట్ ఎస్ఎస్ పరీక్షలను నిర్వహించనున్నట్టు వెల్లడించింది. వీటితోపాటు ఫారిన్ డెంటల్ స్క్రీనింగ్ టెస్ట్ (ఎఫ్‌డీఎస్‌టీ), ఫార్మాటివ్ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎఫ్ఏటీ), డీఎన్‌బీ (బోర్డ్ స్పెషాలిటీ) ఫైనల్ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్స్, ఫెలోషిప్ ఎంట్రెన్స్ టెస్ట్-2024 తదితర పరీక్షల తేదీలను ప్రకటించింది. పరీక్షల షెడ్యూల్‌ను ఎన్‌బీఈ. ఈడీయూ. ఐఎన్‌లో చూడొచ్చు.

ముడా సేకరించిన భూమి నాదే

- సిద్ధరామయ్య భార్య నుంచి భూసేకరణ
- తనకూ వాటా ఉందన్న మహిళ
- స్థానిక కోర్టులో సివిల్ దావా దాఖలు

మైసూరు, నవంబర్ 27: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న ముడా స్కామ్ కొత్త మలుపు తిరిగింది. సిద్ధరామయ్య భార్య పార్వతి నుంచి ముడా సేకరించిన భూమిలో తనకు కూడా వాటా ఉందని పేర్కొంటూ జమున అనే మహిళ స్థానిక కోర్టును ఆశ్రయించారు. మైసూరులోని కేసరే గ్రామంలో 3 ఎకరాల 16 గుంటల భూమిని అభివృద్ధి పనుల కోసం పార్వతి నుంచి ముడా సేకరించి, పరిహారంగా ఖరీదైన 14 ప్లాట్లను కేటాయించింది. ఈ భూమిని దేవరాజు అనే వ్యక్తి నుంచి పార్వతి సోదరుడు మల్లికార్జున స్వామి కొనుగోలు చేసి ఆమెకు బహుమానంగా ఇచ్చారు. అయితే, ఈ భూమి తన తండ్రి మైలారయ్యది అని, ఇందులో తనకు కూడా వాటా ఉంటుందని జమున కోర్టులో సివిల్ దావా వేశారు. దేవరాజుకు జమున మేనకోడలు. ఈ భూమిపై వివాదం మొదలైన తర్వాత తనకు వాటా ఉందనే విషయం తెలిసిందని జమున పేర్కొన్నారు. కాగా, ఈ భూమిని ముడాకు ఇచ్చి, ఖరీదైన స్థలాలు పొందారనే ఆరోపణలతో సిద్ధరామయ్య, ఆయన భార్యపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం లోకాయుక్త పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు.



అమెరికా జాతీయ ఆరోగ్య సంస్థ

డైరెక్టర్‌గా జై భట్టాచార్య

ఎంపిక చేసిన కాబోయే అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్: అమెరికాలో మరో భారతీయుడికి కీలక పదవి దక్కింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్‌కు డైరెక్టర్‌గా ఇండియన్-అమెరికన్ డాక్టర్ జై భట్టాచార్యను ప్రెసిడెంట్ ఎలక్ట్ డొనాల్డ్ ట్రంప్ ఎంపిక చేశారు. ఇది అమెరికాలో అత్యున్నత స్థాయి హెల్త్ రీసెర్చ్, ఫండింగ్ ఇన్‌స్టిట్యూషన్. అత్యున్నత స్థాయి పరిపాలన పదవికి ట్రంప్ ఎంపిక చేసిన తొలి ఇండియన్ అమెరికన్ జై భట్టాచార్య. ఈ పదవికి డాక్టర్ జైని ఎంపిక చేయడం థ్రిల్లింగ్‌గా ఉందని ట్రంప్ అన్నారు. డాక్టర్ రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్‌తో కలిసి జై దేశ వైద్య పరిశోధన, ముఖ్యమైన ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తారని చెప్పారు. అమెరికాను మళ్లీ ఆరోగ్యవంతంగా తయారు చేయడానికి వీరిద్దరూ కృషి చేస్తారన్నారు. డాక్టర్ జై భట్టాచార్య స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో హెల్త్ పాలసీ ప్రొఫెసర్. నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్స్ రీసెర్చ్‌లో రీసెర్చ్ అసోసియేట్.

14 నెలల యుద్ధానికి ముగింపు

- *ఇజ్రాయెల్ - హెజ్బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం*
- *రెండు నెలల కాలానికి డీల్*
- *దక్షిణ లెబనాన్‌ను ఖాళీ చేయనున్న హెజ్బొల్లా, ఇజ్రాయెల్ బలగాలు*
- *లెబనాన్‌లో ప్రజల సంబరాలు*
- *ఒప్పందానికి సిద్ధమే: హమాస్*

బీరుట్, నవంబర్ 27: ఇజ్రాయెల్ - హెజ్బొల్లా మధ్య యుద్ధం ముగిసింది. క్షిపణులు, రాకెట్ల దాడులతో దద్దరిల్లిన దక్షిణ లెబనాన్‌లో శాంతి నెలకొన్నది. 14 నెలల పాటు కొనసాగిన పోరాటానికి ఇరుపక్షాలు బుధవారం స్వస్తి పలికాయి. అమెరికా, ఫ్రాన్స్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఈ ఒప్పందంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు కాస్త ఉపశమనం లభించింది. మొదట 60 రోజుల కోసం ఒప్పందం కుదిరినా, శాశ్వత ఒప్పందంగా కొనసాగే అవకాశం ఉంది. ఈ ఒప్పందాన్ని ఇరాన్, పాలస్తీనా సహా అన్ని దేశాలూ స్వాగతించాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి తామూ సిద్ధంగా ఉన్నట్టు హమాస్ ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్ 7న మొదలైన సంక్షోభం క్రమంగా కొలిక్కి వస్తున్నది.

60 రోజుల్లో బలగాలు వెనక్కు

ఇజ్రాయెల్ - హెజ్బొల్లా మధ్య మొదట 60 రోజుల కోసం ఈ ఒప్పందం కుదిరినట్టు జో బైడెన్ ప్రకటించారు. హెజ్బొల్లా బలగాలు ఐరాస భద్రతా మండలి 1701 తీర్మానాన్ని అనుసరించి దక్షిణ లెబనాన్ నుంచి వెనక్కు, లిటాని నదికి ఉత్తరానికి వెళ్లిపోవాలి. దక్షిణ లెబనాన్‌లో ఆ దేశ సైనికులు మోహరించాలి. 60 రోజుల్లో ఇజ్రాయెల్ సైతం బలగాలను వెనక్కు రప్పించాలి. ఈ ఒప్పందం సరిగ్గా అమలయ్యేలా అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ ప్రతినిధి బృందం పర్యవేక్షించనుంది. దక్షిణ లెబనాన్‌లో 10 వేల బలగాలను మోహరిస్తున్నట్టు లెబనాన్ ప్రకటించింది.

లెబనాన్ ప్రజల సంబరాలు

కాల్పుల విరమణ ఒప్పందం జరగడంతో లెబనాన్ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. దక్షిణ లెబనాన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన ప్రజలు వేలాదిగా మళ్లీ తమ స్వస్థలాలకు వెళ్తున్నారు. బలగాల ఉపసంహరణ పూర్తయ్యే వరకు దక్షిణ లెబనాన్‌కు రావొద్దని ఇజ్రాయెల్, లెబనాన్ సైన్యాలు హెచ్చరించినప్పటికీ ప్రజలు పట్టించుకోవడం లేదు. మొత్తం 12 లక్షల మంది ఈ ప్రాంతం నుంచి తమ ఇండ్లను వదిలి వెళ్లిపోయారు. కాగా, లెబనాన్ సరిహద్దులోని ఉత్తర ఇజ్రాయెల్ ప్రజలు మాత్రం హెజ్బొల్లా ఇంకా సమీపంలోనే ఉన్నందున కొంతకాలం తర్వాతే స్వస్థలాలకు వెళ్తామని చెప్తున్నారు.

మేమూ ఒప్పందానికి సిద్ధమే: హమాస్

తాము కూడా ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి సిద్ధంగా ఉన్నామని హమాస్ ప్రకటించింది. కాల్పుల విరమణ, ఖైదీల అప్పగింత ఒప్పందానికి సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని ఈజిప్ట్, ఖతార్, తుర్కియేలోని మధ్యవర్తులకు చెప్పామని తెలిపింది. గాజాలోనూ యుద్ధవిరమణ ఒప్పందం కోసం మరోసారి ప్రయత్నిస్తామని అమెరికా అధ్యక్షుడు బైడెన్ బుధవారం ప్రకటించారు. కాగా, ఇజ్రాయెల్ - హెజ్బొల్లా మధ్య ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. ఈ ఒప్పందం శాంతి, స్థిరత్వాన్ని తీసుకొస్తుందని పేర్కొన్నది.